సాక్షి
జగిత్యాల
గురువారం । 9 । అక్టోబర్ । 2025



నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.



ఆయుధాలు డిపాజిట్

స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతలపై పోలీసు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమలులోకి వచ్చిన విషయం తెల్సిందే. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం కాస్త ఎండవేడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాముల పరిశీలన



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల: ఈవీఎంలు భద్రపర్చిన జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లోగల గోదాములను కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. యంత్రాల భద్రత, సీసీకెమెరాల పనితీరును తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ లత, ఆర్డీవో మధుసూదన్, ఏవో హకీం, అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ ఉన్నారు.

గుండె సంబంధిత వ్యాధులు నిర్ధారణ చేసుకోవాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



పేషెంట్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల: పుట్టుకతో వచ్చే గుండె సంబంధిత వ్యాధులను నిర్ధారించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మాతాశిశు సంక్షేమ కేంద్రంలో హృదయ సంబంధిత వ్యాధుల నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. 2డీఈకో ద్వారా పరీక్షించి సిద్దిపేటలోని సత్యసాయి సంజీవని ఆస్పత్రిలో చికిత్స అందిస్తారని వెల్లడించారు. అనంతరం జగిత్యాల మైనార్టీ గురుకులంలో ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకుని నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించిన విద్యార్థి సురేందర్‌ను అభినందించారు. ప్రిన్సిపల్ మహేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న దావ వసంత


రాయికల్: రైతుల దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రూ.1800 నుంచి రూ.1900వరకే కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ కనీసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరమన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్, మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్, కో–ఆర్డినేటర్ తురగ శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సాయికుమార్, మహేందర్, మాజీ కో–ఆప్షన్ మెంబర్ సోహెల్, నాయకులు రాంచంద్రం, వినోద్, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 25 దరఖాస్తులు

జగిత్యాలక్రైం: జిల్లాలోని 71 మద్యం షాపులకు బుధవారం వరకు 25 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. దరఖాస్తుదారులు నేరుగా ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించినా.. అధికారులు సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు.

పొలిటికల్ సీన్

వేద్దామా.. వేచిచూద్దామా?



తొలివిడుత ఎన్నికల షెడ్యూల్

నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9 నుంచి 11 వరకు
(ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు)

నామినేషన్ పరిశీలన: అక్టోబర్ 12

ఉపసంహరణకు తుది గడువు: అక్టోబర్ 15 (మధ్యాహ్నం 3వరకు)

పోలింగ్: అక్టోబర్ 23, ఓట్ల లెక్కింపు: నవంబర్ 11

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 311 ఎంపీటీసీలు, 30 జెడ్పీటీసీ స్థానాలకు..
- నేటి నుంచి తొలివిడత నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- అందరి దృష్టి హైకోర్టు తీర్పు పైనే..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉత్కంఠ వీడకముందే స్థానిక సంస్థల ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ప్రక్రియ నేటి నుంచి మొదలుకానుంది. గురువారం ఉదయం 10.30కి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకానుంది. ఆ తదుపరి నామినేషన్ల స్వీకరణకు ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. ప్రభుత్వ పనిదినాల్లో ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఈనెల 11వరకు నామినేషన్లు దాఖలుకు గడువు ఉండగా.. 15వరకు నామినేషన్ ఉపసంహరించుకోవచ్చు. ఉపసంహరణ అనంతర పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించి తుది జాబితా ప్రకటించనున్నారు. 23న పోలింగ్ నిర్వహించి నవంబర్ 11న కౌంటింగ్ చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు. గందరగోళం మధ్యే నోటిఫికేషన్ విడుదల కానుండటంతో తొలి రోజు నామినేషన్లు దాఖలయ్యే అయ్యే అవకాశం ఉండకపోవచ్చని అధికారులు చెప్పుతున్నారు.

జగిత్యాల జిల్లాలో మొదటి విడతలో నామినేషన్లు వేసే మండలాలు: 10
ఎంపీటీసీ స్థానాలు : 108
జెడ్పీటీసీ స్థానాలు : 10
(బీర్‌పూర్, రాయికల్, సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి, బీమారం, కథలాపూర్, కోరుట్ల, మేడిపల్లి)

వీడని ఉత్కంఠ

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీవో 9ను విడుదల చేసి, దానికి అనుగుణంగా రిజర్వేషన్లు ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు హైకోర్టు మెట్లు ఎక్కగా, బుధవారం విచారించిన కోర్టు కేసును గురువారం మధ్యాహ్నం 2.15కు వరకు వాయిదా వేసింది. దీంతో ఇప్పటికే ప్రకటించిన రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తారా? లేదా అనే డైలమాలో ఆశవాహులున్నారు. దీంతో నామినేషన్ వేద్దామా? వేచిచూద్దామా అన్న సందిగ్ధంలో ఉన్నారు. నేడు హైకోర్టు ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా? విచారణ మరో రోజుకి వాయిదా వేస్తుందా..? అనే ఉత్కంఠ నెలకొంది.

అభ్యర్థులు ఖరారు చేసినా..

నేడు నామినేషన్లకు నోటిఫికేషన్ రానుండటంతో కాంగ్రెస్ తరపున బరిలో నిలిచే అభ్యర్థులతో నామినేషన్లు వేయించేలా పీసీసీ ఇప్పటికే ఆయా జిల్లాల డీసీసీలను అలెర్ట్ చేసింది. దీంతో తొలిరోజు కాంగ్రెస్ పార్టీ తరపున పలువురు నామినేషన్లు వేసే అవకాశం ఉంది. బీఆర్ఎస్, బీజేపీలు ఆయా పార్టీల తరపున పోటీచేసే అభ్యర్థులను ఎంపిక చేసినా, హైకోర్టు తీర్పు తరువాతే ప్రకటించేలా కసరత్తు చేస్తున్నారు. మొత్తంగా ఎన్నికలు జరుగుతాయో తెలియని పరిస్థితుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుండటంతో పల్లెల్లో ఎక్కడ చూసిన దీనిపైనే చర్చ జరుగుతుండగా, అందరి దృష్టి హైకోర్టు తీర్పుపైనే నెలకొంది.

ఆర్టీసీకి దసరా బోనాంజ

- సెప్టెంబర్ 20 నుంచి ఈనెల ఏడు వరకు స్పెషల్ బస్సులు
- జిల్లా పరిధిలో మూడు బస్ డిపోలు
- 17లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులు
- 19 లక్షల మంది గమ్యస్థానానికి..
- వీరిలో 15లక్షల మంది 'మహాలక్ష్ములు'
- మూడు డిపోల పరిధిలో రూ.10.78 కోట్ల ఆదాయం



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్సులు

జగిత్యాలటౌన్: దసరా సందర్భంగా జిల్లా పరిధిలోని జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్టీసీ డిపోల పరిధిలో సంస్థకు కాసుల పంట పండింది. సెప్టెంబర్ 20వ తేదీ నుంచి ఈనెల ఏడో తేదీ వరకు (17రోజులపాటు) చేపట్టిన స్పెషల్ ఆపరేషన్స్‌తో జిల్లా ఆర్టీసీకి రూ.10కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డిపోల నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు బస్సులు నడిపించారు. ఇందులో రూ.4,49,056తో జగిత్యాల డిపో మొదటి స్థానంలో.. రూ.3,72,051 ఆదాయంతో కోరుట్ల డిపో రెండోస్థానంలో.. రూ.2,56,044తో మెట్‌పల్లి డిపో మూడో స్థానంలో నిలిచాయి. మూడు డిపోల పరిధిలో ఉన్న బస్సులు 17లక్షల కిలోమీటర్ల మేర నడిచాయి. మొత్తంగా 19 లక్షల మంది ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేర్చారు. ఇందులో 15లక్షల మంది 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు ఉండటం విశేషం. మూడు డిపోలకు రూ.10 కోట్లకుపైగా ఆదాయం రావడంపై ఆర్టీసీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది, ప్రయాణికుల సహకారంతోనే..



ఆర్టీసీ ఎండీ ఆదేశాలు, రీజనల్ మేనేజర్ సూచనల మేరకు నిర్వహించిన స్పెషల్ ఆపరేషన్‌తో అనుకున్న దానికంటే ఎక్కువ ఆదాయం వచ్చింది. ఇది సంస్థకు బూస్టప్‌గా భావిస్తున్నాం. స్పెషల్ ఆపరేషన్‌లో పాల్గొని విజయవంతం చేసిన సిబ్బంది, ప్రయాణికులకు అభినందనలు.

– కల్పన, జగిత్యాల డిపో మేనేజర్

డిపోల వారీగా 'స్పెషల్' ఆపరేషన్ వివరాలు

డిపో	కి.మీ.(లక్షల్లో)	ఆదాయం(రూ.లక్షల్లో)	ప్రయాణికులు(లక్షల్లో)	మహాలక్ష్మి(లక్షల్లో)
జగిత్యాల	7.79	449.56	9.06	6.52
కోరుట్ల	5.07	372.51	7.01	5.64
మెట్‌పల్లి	4.14	256.44	3.75	2.98
మొత్తం	17	1078.51	19.82	15.14

ప్రణాళికతో 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్



పాల్గొన్న పోలీసు అధికారులు

- నియమావళిపై అవగాహన ఉండాలి
- పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించాలి
- ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాలక్రైం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఈసీ మార్గదర్శకాల ప్రకారం ప్రణాళికతో విజయవంతం చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. నేర విచారణ, కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎన్నికల నియమావళి, అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, నేరాలపై సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియమావళి, ప్రవర్తనపై ప్రతి పోలీసు అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా వేయాలన్నారు. నేరాలు చేసేవారు, నేర స్వభావం కలిగిన వారిని గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి 31 వరకు ఫ్లాగ్ డేను ప్రతి స్టేషన్‌లో విధిగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన, గణేశ్, దుర్గామాత, దసరా, బతుకమ్మ పండుగలు ప్రశాంతంగా పూర్తి చేయడంలో పాత్ర వహించిన పోలీస్ అధికారులు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, రాములు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

'భూభారతి' దరఖాస్తులు పరిష్కరించాలి

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో సమీక్షించారు. ఆర్ఎస్ఆర్‌లో తేడా ఉన్న సర్వేనంబర్లపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. సాదాబైనామా కేసులు పరిష్కరించాలని, అసైన్డ్ కేసుల్లో ఎంక్వైరీ పూర్తి చేసి కోర్టు కేసుల్లో ఉన్న భూములపై కౌంటర్ దాఖలు చేయాలన్నారు. భూసేకరణకు తొందరగా అవార్డు చేయాలన్నారు.

దరఖాస్తులు పరిశీలించాలి

మల్యాల: రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం సిబ్బంది, జీపీలతో సమావేశమయ్యారు. జీపీఓల బాధ్యతలు, విధులపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ అనంద్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, జమున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్



రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా..?

ఈ చిత్రంలో కనిపిస్తున్నది జిల్లాకేంద్రంలోని 48వార్డులోని టీఆర్‌నగర్‌కాలనీకి వెళ్లే దారి. ఎక్కడ చూసినా బురదే. ఎక్కడ జారి పడతామోనని కాలనీవాసులు భయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్నారు. మొన్నటివరకు ఇది గ్రామపంచాయతీగా ఉండేది. మున్సిపాలిటీలో విలీనం చేసినప్పటి నుంచి అక్కడి ప్రజలను పట్టించుకునే నాథుడే లేడు. కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి కాలనీ రోడ్డును బాగుచేయించాలని కోరుతున్నారు.

- జగిత్యాల



నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయండి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

జగిత్యాల: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని కలెక్టర్ సత్యప్రసాద్‌ను ఆదేశించారు. ఈనెల 9 నుంచి 11 వరకు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలన్నారు. నామినేషన్ల పరిశీలన 12న సాయంత్రం ఐదు గంటల వరకు పూర్తి చేసి జాబితా ప్రకటించాలన్నారు. 13న అప్పీల్ కోసం సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇవ్వాలని, 14న అప్పీళ్లను పరిష్కరించాలని, నామినేషన్ ఉపసంహరణ 15న మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఇవ్వాలని సూచించారు. అదేరోజు జాబితా ప్రచురించాలని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి విడత ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత కల్పించామన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో మదన్‌మోహన్ పాల్గొన్నారు.

కట్టలకు పగుళ్లు.. ప్రమాదంలో చెరువులు

- పట్టణం చుట్టూ నాలుగు చెరువులు
- కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు
- ఎప్పుడేం జరుగుతుందోనని భయంభయం
- జిల్లాకేంద్రం వాసులకు పొంచి ఉన్న ప్రమాదం



కుంగిపోయిన కండ్లపల్లి చెరువు కట్ట వద్ద ఎమ్మెల్యే

జగిత్యాల: జిల్లా కేంద్రం చుట్టూ మోతె చెరువు, కండ్లపల్లి చెరువు, లింగంపల్లి చెరువు, ముప్పారపు చెరువు ఉన్నాయి. వీటితోపాటు చల్‌గల్‌లో పెద్ద చెరువు, పొలాసలో కొత్తకుంట చెరువులు ప్రధానమైనవి. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అన్ని చెరువుల కట్టలు కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. కట్టలకు గండ్లుపడితే జిల్లాకేంద్రాన్నే ముంచెత్తనున్నాయి. కండ్లపల్లి చెరువుకు ప్రమాదం జరిగితే నీరంతా పట్టణంలోకే చేరుతాయి. మోతె, కండ్లపల్లి, ముప్పారపు చెరువుల చుట్టూ అనేక ఇళ్ల నిర్మాణాలున్నాయి. ఆ చెరువు కట్టలు పగుళ్లు పారడంతో ఎప్పుడేం జరుగుతుందోనని చుట్టుపక్కల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పొంచి ఉన్న ముప్పు:

జిల్లాకేంద్రంలోని చింతకుంట నుంచి కండ్లపల్లి చెరువు, ధరూర్, మోతె చెరువు మధ్య నిర్మించిన గొలుసుకట్టు కాలువల్లో చెట్లు విపరీతంగా పెరిగాయి. కాలువ ద్వారా నీరు ప్రవహించే పరిస్థితే కన్పించడం లేదు. ఇటీవల చింతకుంట చెరువును కలెక్టర్ సత్యప్రసాద్ స్వయంగా పరిశీలించారు. వెంటనే మరమ్మతు చేపట్టాలని మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో కాలువ కూడా కబ్జా కావడంతో కుచించుకుపోయింది. ఒకవేళ నీటి ప్రవాహం పెరిగితే కాలువ ద్వారా కాకుండా బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కట్టలు పూర్తిగా పగుళ్లుబారడం కలవరపెడుతోంది. కాలువల్లో పూడిక తీయకపోవడం, చెరువు కట్టలకు మరమ్మతు చేయించకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రెవెన్యూ, మున్సిపల్, ఎస్సారెస్పీ అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

చెరువుల మరమ్మతుకు నిధుల ప్రతిపాదన ఇలా..
మోతె పెద్ద చెరువు : రూ.288 లక్షలు
ధర్మసముద్రం చెరువు: రూ. 121.20 లక్షలు
చల్‌గల్ పెద్ద చెరువు : రూ.54.20 లక్షలు
పొలాస కొత్తకుంట చెరువు : రూ.14.89 లక్షలు
ముప్పారపు చెరువు : 101 లక్షలు

మరమ్మతు ఎప్పుడో..?

చెరువుల మరమ్మతుకు ఎస్సారెస్పీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. మోతె పెద్ద చెరువుకు రూ.288 లక్షలు, ధర్మసముద్రం చెరువుకు రూ.121.20 లక్షలు, చల్‌గల్ పెద్ద చెరువుకు రూ.54.20 లక్షలు, పొలాస కొత్తకుంట చెరువుకు రూ.14.89 లక్షలు, ముప్పారపు చెరువుకు రూ.101 లక్షలు ఖర్చవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా.. నిధులు మంజూరుకాకపోవడం గమనార్హం.

రైతుల్లోనూ కలవరం

చెరువు కట్టలు కుంగిపోవడంతో ఆయకట్టు రైతుల్లోనూ ఆందోళన నెలకొంది. పగుళ్లు చూపిన కట్టలకు గండిపడితే తమ పంటలు నాశనం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంగపుత్రుల ఫిర్యాదు మేరకు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కండ్లపల్లి చెరువు కట్టను పరిశీలించారు. వెంటనే మరమ్మతు చేపట్టాలని క్వాలిటీ కంట్రోలర్, కన్‌స్ట్రక్షన్స్ ఎస్‌ఈతో మాట్లాడారు. కండ్లపల్లి చెరువు కట్టకు మరో రూ.27 లక్షలు మంజూరయ్యాయని పనులు అలసత్వం వద్దని సూచించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాకేంద్రం చుట్టూ చెరువులు ఉన్నాయి. కొన్ని కట్టలు కుంగిపోయి పగుళ్లు బారాయి. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. త్వరలోనే మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. హైదరాబాద్‌లో ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లాను. లోతట్టు ప్రజలు కొంత అప్రమత్తంగా ఉండాలి.

– సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

చర్యలు తీసుకుంటున్నాం

చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతు చర్యలు చేపడతాం. అలాగే కాలువల్లో పూడిక తీసేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు రానీయం.

– ఖాన్, ఎస్సారెస్పీ ఈఈ

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లిరూరల్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అధికారంలోకొచ్చిన 22నెలల్లో చేసిందేమీలేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో బుధవారం పర్యటించారు. ప్రజలను కలుస్తూ కాంగ్రెస్ బాకీకార్డులు అందించారు. కాంగ్రెస్ హామీలు, మోసం, నయవంచనను ప్రజలకు వివరించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులకు బాకీ కార్డులు చూపించి నిలదీయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు బండ రాజేందర్, మురళి పాల్గొన్నారు.



వెల్లుల్లలో కాంగ్రెస్ బాకీ కార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, నాయకులు

అభ్యర్థులూ జర భద్రం..

- నామినేషన్ వేస్తున్నారా..? ఇవి తప్పనిసరి
- అన్ని సరిగా ఉంటేనే పోటీకి అర్హులు

మల్యాల: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ వేసే అభ్యర్థులు దరఖాస్తుల్లో పలు అంశాలను సరిచూసుకోవాలి. అభ్యర్థికి 21ఏళ్లు పూర్తయి ఉండాలి. జాబితాలో ఓటరుగా నమోదై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రం జతపరచాలి. నేర చరిత్ర, స్థిర, చర ఆస్తులు, విద్యార్హత అఫిడవిట్‌లో ఇద్దరు సాక్షులతో సంతకం చేయించాలి. ఎన్నికల వ్యయ నిర్వహణ చేస్తామని డిక్లరేషన్ ఇవ్వాలి. డిపాజిట్ చెల్లించాలి. ఏ పార్టీ తరపున పోటీ చేస్తున్నారో పేర్కొనాలి. లేనిపక్షంలో బీఫాం సమర్పించినా పార్టీ గుర్తు కేటాయించరు. బీఫాం సమర్పించకపోతే స్వతంత్ర అభ్యర్థిగా గుర్తించి గుర్తు కేటాయిస్తారు. ఏ స్థానానికి పోటీ చేస్తున్నారో ఆ స్థానం నుంచి ఓటరు మాత్రమే ప్రతిపాదించాలి. నామినేషన్ పత్రంలో పార్ట్–1లో ప్రతిపాదకుని సంతకం చేయాలి. పార్ట్–2, పార్ట్–3లో కూడా అభ్యర్థి సంతకం చేయాలి. పార్ట్–4లో రిటర్నింగ్ ఆఫీసర్ సంతకం ఉండాలి. పార్ట్–5లో తిరస్కరించిన నామినేషన్ పత్రంలో రిటర్నింగ్ ఆఫీసర్ సంతకం ఉండాలి. పార్ట్–6లో రశీదులో రిటర్నింగ్ ఆఫీసర్ సంతకం ఉండాలి. అఫిడవిట్‌లో ఇద్దరి సాక్షుల సంతకంతోపాటు, అభ్యర్థి సంతకం ఉండాలి. ఎన్నికల వ్యయ నిర్వహణ డిక్లరేషన్‌లో అభ్యర్థి సంతకం చేయాలి.

క్లుప్తంగా

గుండెపోటుతో యువకుడి మృతి


పర్శరాములు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన కూడలి పర్శరాములు(35) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. పర్శరాములు గ్రామంలో దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గ్రామంలోనే కూలీ పనిచేస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కడు పేదరికం అనుభవిస్తున్న పర్శరాములు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం పర్శరాములు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతుడికి భార్య వినోద, కుమారుడు రిత్విక్ ఉన్నారు.

దుబాయిలో వాల్గొండ వాసి..


రమేశ్ (ఫైల్)

మల్లాపూర్: మండలంలోని వాల్గొండ తండాకు చెందిన లకావత్ రమేశ్ (45) దుబాయిలోని షార్జాలో బుధవారం వేకువజామున మూడు గంటలకు గుండెపోటుతో మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. రమేశ్ ఉపాధి కోసం ఏడాది క్రితం దుబాయి వెళ్లాడు. షార్జాలోని ఓ కంపనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం విధులు నిర్వర్తించి తన గదిలో నిద్రిస్తుండగా గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి కార్మికులు ఇక్కడి కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారు. రమేశ్‌కు భార్య పద్మ, కుమార్తె వసంత, కుమారుడు హర్షిత్ ఉన్నారు. శవాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఆయన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కోరారు.

కొత్తపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి..

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు తెలిపారు. మున్సిపల్ పారిశుధ్య సూపర్‌వైజర్ తూముల కుమారస్వామి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం లభ్యం

హుజూరాబాద్ మండలం ఇప్పలనర్సింగాపూర్ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ఓ గుర్తు తెలియని మృతదేహం బుధవారం కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతుడి వయస్సు 40ఏళ్లు ఉంటుందని గుర్తించారు. మృతుడు రెండు రోజుల క్రితం కాలువలో పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆత్మహత్యనా.? లేక మరేదైనా కారణాలా అని తెలియాల్సి ఉంది.

అపస్మారక స్థితిలో దంపతులు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి

గంగాధర: వృద్ధదంపతులిద్దరూ ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. చుట్టుపక్కల వారు గమనించి ఆస్పత్రికి తరలించగా.. భర్త చికిత్స పొందుతూ చనిపోయాడు. ఎస్సై వంశీకృష్ణ వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామంలో గజ్జెల శంకరయ్య(75)– లక్ష్మి(70) దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఎవరూ లేరు. మంగళవారం ఇద్దరూ ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గ్రామస్తులు గమనించారు. వెంటనే పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శంకరయ్య బుధవారం చనిపోయాడు. లక్ష్మి చికిత్స పొందుతోంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆయుధాలు డిపాజిట్

- జిల్లాలో లైసెన్స్‌డ్ తుపాకులు 30
- పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని నోటీసులు
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం



జగిత్యాలక్రైం: స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతలపై పోలీసు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమలులోకి వచ్చిన విషయం తెల్సిందే. దీంతో వ్యక్తిగతంగా లైసెన్స్ ఆయుధాలు కలిగిన వారి నుంచి డిపాజిట్ చేసుకునేందుకు పోలీస్‌స్టేషన్ల వారీగా నోటీసులు జారీ అయ్యాయి. జిల్లాలో 30 మంది వద్ద లైసెన్స్‌డ్ తుపాకులు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం లైసెన్స్‌డ్ తుపాకులను తెప్పించుకుని పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయిస్తున్నారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, రియల్టర్లు ఆయుధాల కోసం లైసెన్స్ పొందారు. వీరితోపాటు ప్రైవేటు బ్యాంక్‌ల భద్రత కోసం ఆయుధాలకు లైసెన్స్ జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆయుధాలు ఉన్నవారు బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉండటంతో ఎన్నికలయ్యే వరకు పోలీసులు డిపాజిట్ చేసుకుంటారు. ఆయుధ లైసెన్స్ ఉన్నవారి వివరాలను నేషనల్ డేటా బేస్ ఆర్మ్స్ లైసెన్స్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్కరికి ఐడీ నంబరు కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో 30 మంది లైసెన్స్‌దారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి బుధవారం సాయంత్రం వరకు డిపాజిట్ చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఆయుధ లైసెన్స్ పొందాలంటే...

భద్రత కోసం వ్యాపారవేత్తలు, ఇతరులు ఆయుధ లైసెన్స్ పొందాలంటే పలు కారణాలు చూపించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే ప్రతి వ్యక్తికి ఇతరుల నుంచి ప్రాణహాని ఉంటేనే లైసెన్స్ ఇస్తారు. సంబంధిత వ్యక్తి సంఘ విద్రోహశక్తులు, మావోయిస్టులతో సంబంధం ఉండకూడదు. రాజకీయ నాయకులు ప్రత్యర్థి పార్టీ నుంచి ముప్పు ఉంటే లైసెన్స్ ఇస్తారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లే వ్యాపారులు, రియల్టర్లు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆస్తుల రక్షణ కోసం ఆయుధ లైసెన్స్ ఇస్తారు. లైసెన్స్‌లు కావాలంటే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆయన రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారి పూర్తిస్థాయిలో విచారణ చేపడతారు. లైసెన్స్‌దారుడు మూడేళ్లకోసారి రెన్యూవల్ చేయించుకోవాలి. ఒక లైసెన్స్‌పై 3 ఆయుధాలు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఆయుధాలను కొనుగోలు చేసి వాటి వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అందించాల్సి ఉంటుంది. లైసెన్స్ కలిగిన వ్యక్తులపై ఏదైనా సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదైతే వారి ఆయుధ లైసెన్స్ రద్దు చేస్తారు.

ఆయుధాలు అప్పగించారు



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్‌లు ఉన్న తుపాకులను ఆయా పోలీస్‌స్టేషన్లలో అప్పగించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఆయుధాలు డిపాజిట్ చేసుకుంటున్నాం. – అశోక్‌కుమార్, ఎస్పీ

ఆనందం.. ఆహ్లాదం.. ఆరోగ్యం..


వ్యాయామం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

- రోజూ వ్యాయామం.. యోగా సాధన
- సుఖదుఃఖాలు పంచుకుంటున్న వైనం
- ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆదర్శం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తిలో సుదీర్ఘకాలం భాగస్వాములై ఉద్యోగ విరమణ పొందిన పలువురు ఉద్యోగులు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. రోజూ సూర్యోదయానికి ముందే స్థానిక ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీ మైదానానికి కాలినడకన చేరుకుంటున్నారు. వ్యాయామం, యోగా, ధ్యానం సాధన చేస్తూ, ఆసనాలు వేస్తున్నారు. మనశ్శాంతి, ఆహ్లాదం కోసం కలిసి కూర్చొని మాట్లాడుకుంటున్నారు. సూర్యాస్తమయానికి ముందే మళ్లీ అందరూ మైదానం చేరుకుని సాధన చేస్తున్నారు.

నడకతో మేలు



నేను ఉద్యోగ విరమణ పొంది ఐదేళ్లవుతంది. రోజూ 30 నిమిషాలపాటు నడుస్త. మరో 30 నిమిషాలపాటు వ్యాయామం చేస్త. చాలాఆరోగ్యంగా ఉంటున్నా. ప్రాంతాలు వేరైనా అందరం కలిసి ప్లాంట్‌లో పనిచేశాం. ఒకేప్రాంతంలో ఉంటున్నాం. మాకు మేమే స్నేహితులం.
– కొమ్ము గోపాల్

వ్యాయామం చేస్తున్నాం



ఎన్టీపీసీ ప్రాజెక్టులో ఇంతకుముందు విద్యుత్ ఉత్పత్తిలో అందరం కలిసి పనిచేసేవాళ్లం. ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందాం. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వాకింగ్‌లో కలుస్తూ అందరం కలిసిమెలసి ఉంటున్నాం. బాధలు, సంతోషాలు పంచుకుంటూ ఆనందంగా ఉంటున్నాం.
– పురుషోత్తం

ఆనందం పంచుకుంటున్నాం



ప్రతీరోజు అందరం మైదానంలో కలిసి నడక తర్వాత వ్యాయామం, యోగా, ధ్యానం సాధన చేస్తున్నాం. కాసేపు జోకులు వేసుకుంటూ నవ్వుకుంటున్నాం. సమాజంలోని పలు అంశాలను సైతం చర్చించుకుంటున్నాం. ఉద్యోగం చేస్తున్నప్పటిలాగే ఇప్పుడూ ఆనందం, సంతోషం పంచుకుంటున్నాం.
– శంకరయ్య

యోగా చేస్తున్నా



నాలుగేళ్ల క్రితం రిటైర్డ్ అయిన. ఉద్యోగం చేసే సమయంలో కొందరం మిత్రులం కలిసి కృష్ణానగర్‌లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్నాం. ఇప్పుడు అక్కడే ఉంటున్నాం. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తున్నాం. నాకు యోగా అంటే చాలాఇష్టం. నేను సాధన చేస్తూనే మిత్రులకు నేర్పిస్తున్నా.
– రాజయ్య

24 గంటలు.. 20 ఆపరేషన్లు


వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వివిధ రకాల ఆపరేషన్ల పేషెంట్లు..

- వేములవాడ ఆస్పత్రి రికార్డు

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిలో 24 గంటల్లో 20 వివిధ రకాల ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. సాధారణ కాన్పులు 4, ఆపరేషన్లు 9, కంటి ఆపరేషన్లు 4, జనరల్ సర్జరీలు 2, ఆర్థో ఆపరేషన్ ఒకటి చేశారు. ఆపరేషన్ చేసిన వైద్యులు సంధ్య, సోని, మాధవి, సుభాషిణి, చారీ, రమణ, అనిల్‌కుమార్, రాజశ్రీ, తిరుపతి, రవీందర్, రత్నమాల, నర్సింగ్ ఆఫీసర్స్ ఝాన్సీ, జ్యోతి, అనసూయతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌లో కేంద్ర మంత్రి అభినందనలు

వైద్యసేవలు అందించడంలె నిబద్ధతతో పనిచేస్తున్న వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నానంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఎక్స్ వేదికగా అభినందించారు. డాక్టర్లు, సిబ్బంది అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్యకు, వైద్యసిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.

వైద్యులకు ప్రభుత్వ విప్ ఆది అభినందనలు

వేములవాడ ఏరియా ఆస్పత్రి వైద్యులు 24 గంటల్లో 20 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేయడంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందించారు. ఆధునిక వైద్యసేవలతోపాటు శుభ్రత, రోగి సేవ ధోరణిలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. వైద్యులు, సహాయక సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

వేములవాడలో కొండచిలువ


కొండచిలువను పట్టుకున్న జగదీశ్

వేములవాడ: స్థానిక పార్వతీపురం వద్ద 13 ఫీట్ల పొడవు ఉన్న కొండచిలువ బుధవారం సంచరించింది. గమనించిన ఆలయ అధికారులు పాములు పట్టే యువకుడు జగదీశ్‌కు సమాచారం ఇచ్చారు. అతను వచ్చి దాదాపు మూడు గంటలు శ్రమించి కొండచిలువను పట్టుకొని అటవీప్రాంతంలో వదిలిపెట్టాడు.

రైలు నుంచిపడి వ్యక్తికి గాయాలు


గాయపడిన సుమిత్‌గుప్తా

రామగుండం: కదులుతున్న రైలు నుంచి దిగే ప్రయత్నంలో సుమిత్‌గుప్తా అనే ప్రయాణికుడు ప్లాట్‌ఫారమ్‌పై పడి తీవ్రగాయాలపాలయ్యాడు. కరీంనగర్ నుంచి రామగుండం వైపు వస్తున్న పుష్‌పుల్ రైలులో సుమిత్‌గుప్తా వస్తున్నాడు. స్థానిక రైల్వేస్టేషన్‌లో రైలు ఆగింది. ఆ తర్వాత కదులుతున్న క్రమంలో సుమిత్‌గుప్తా దిగే ప్రయత్నం చేసి ప్లాట్‌ఫారంపై పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహన సిబ్బంది గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు కరీంనగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేశామని జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపారు.

ఆలస్యంగా వచ్చారు.. రంగు డబ్బా తీసుకురండి

- క్రమశిక్షణ కోసమేనంటున్న గురుకుల అధ్యాపకులు


రంగుడబ్బాతో విద్యార్థి తల్లి

వేములవాడఅర్బన్: దసరా సెలవులు ముగిసిన తర్వాత విద్యాసంస్థలు శనివారం పునర్‌ప్రారంభమయ్యాయి. ఈక్రమంలోనే పలువురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో కళాశాల అధ్యాపకులు వారికి ఫైన్ వేశారు. పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఆలస్యంగా బుధవారం రావడంతో ఒక్కొక్కరికి ఒక్కో రంగుడబ్బా కొని అప్పగించాలని హుకూం జారీ చేశారు. దూరం నుంచి వచ్చామని తమ వద్ద డబ్బులు లేవని చెప్పినా అధ్యాపకులు వినిపించుకోకపోవడంతో వారు ఇబ్బంది పడ్డారు. ఈ విషయంపై కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ అనురాధను 'సాక్షి' వివరణ కోరగా కళాశాల ప్రారంభమై ఐదు రోజులు గడుస్తున్నా విద్యార్థులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్నందునా వారిలో క్రమశిక్షణ పెంచాలని తాము రంగుడబ్బాలు తీసుకురావాలని ఫైన్‌గా వేసినట్లు తెలిపారు. విద్యార్థులు కొనుగోలు చేసి తెచ్చిన రంగు డబ్బాలతోనే కళాశాల, పాఠశాల ఆవరణలో పెయింటింగ్ వేయిస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ మోసాలను ఎండగడుతాం

- బాకీ కార్డులతో ఇంటింటికీ వెళ్తాం
- ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్


బాకీ కార్డు చూపిస్తూ మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల: కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లో ఎండగడుతామని, 22 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని నెరవేర్చలేదని రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఎనిమిది హామీలతో కూడిన కాంగ్రెస్ బాకీ కార్డులను బుధవారం ఆవిష్కరించారు. 2023లో ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రతీ మహిళకూ రూ.2500 ఇస్తామని ఇవ్వలేదని, ఇలా ఒక్కో మహిళకు 22 నెలలుగా రూ.55 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందన్నారు. వృద్ధులకు పెన్షన్‌ను రూ.4 వేలు ఇస్తామని రూ.44వేలు బాకీ పడ్డారని, దివ్యాంగులకు రూ.44వేలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం, రైతుభరోసాగా ప్రతీ రైతుకు రూ.2లక్షలు, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, విద్యార్థినిలకు స్కూటీ, విద్యాభరోసా కార్డులు బాకీ పడ్డారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ బాకీకార్డులను ఇంటింటికీ తీసుకెళ్లి వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులను కోరారు. బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెలిమెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై అబద్ధాల ప్రచారం చేశారని, వేములవాడ రాజన్న ఆలయాన్ని మూసివేయొద్దని కోరారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడ్డారని, అన్ని వర్గాల వారు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారన్నారు. కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, టెస్కో మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, పార్టీ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, సిద్ధం వేణు, గజభీంకార్ రాజన్న, పబ్బతి విజయేందర్‌రెడ్డి, జక్కుల నాగరాజు, 'సెస్' డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రావు, నారాయణరావు, హరిచరణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలు వీరే


లక్కీడ్రా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

విద్యానగర్(కరీంనగర్): బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ 11డిపోల పరిధిలో నిర్వహించిన లక్కీడ్రాను బుధవారం కరీంనగర్ బస్‌స్టేషన్ ప్రాంగణంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ తీశారు. కరీంనగర్‌కు చెందిన ఈ.రమేశ్ మొదటి బహుమతి రూ.25వేలు, గోదావరిఖనికి చెందిన వి.సదానందం రెండో బహుమతిగా రూ.15వేలు, జగిత్యాలకు చెందిన కె.నాగరాజు మూడోబహుమతిగా రూ.10వేలు గెలుచుకున్నారు. కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్.భూపతిరెడ్డి, 1,2 డిపోల మేనేజర్లు ఐ.విజయమాధురి, ఎం.శ్రీనివాస్, బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్.మల్లేశం, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


అజయ్ కుమార్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): బీటెక్ చదివినా వార్షిక పరీక్షల్లో ఫెయిలయ్యాడు.. కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయం చేసినా కలిసిరాక అప్పుల పాలయ్యాడు.. మనస్తాపం చెందిన గోప గోని అజయ్‌కుమార్(26) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ హైదరాబాద్‌లో బీటెక్ చదివాడు. పరీక్షల్లో ఫెయిల్ కావడంతో స్వగ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. పంటల పెట్టుబడి కోసం కొంత అప్పు చేశాడు. మరికొంత మద్యం తాగేందుకు వెచ్చించాడు. వ్యవసాయం కలిసిరాకపోవడం, అప్పులు తీర్చే దారిలేక, బీటెక్ కూడా ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఈనెల 4న పొలం వద్ద గడ్డిమందు తాగాడు. తాను గడ్డిమందు తాగి విషయాన్ని తన ఫ్రెండ్స్‌కు ఫోన్ ద్వారా చేరవేశాడు. వారి సమాచారంతో తల్లిదండ్రులు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఈనెల 7న రాత్రి మృతి చెందాడు. తండ్రి సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

మద్యానికి బానిసై..

మానకొండూర్: మానకొండూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సదాశివపల్లి గ్రామానికి చెందిన సాయిని మహిపాల్(35) మద్యానికి బానిసై బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ బి.సంజీవ్ వివరాల ప్రకారం.. మహిపాల్‌కు పదేళ్ల క్రితం వివాహమైంది. భార్యతో గొడవలతో ఐదేళ్లక్రితం విడాకులయ్యాయి. ఒంటరిగా ఉంటున్న మహిపాల్ మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కనకమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

తగ్గిపోయిన పాడి పశువులు

- వ్యవసాయంలో పెరిగిన యంత్రాల వినియోగం
- రసాయనాల వినియోగంతో తగ్గుతున్న భూసారం
- ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్యానికి మేలంటున్న మేధావులు


ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

వెల్గటూర్: వ్యవసాయంలో నిత్య జీవనమైన పశుపోషణ క్రమక్రమంగా కనుమరుగవుతోంది. మారుతున్న కాలానికి తగ్గట్టు వ్యవసాయం కూడా కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు ప్రతిరైతు ఎడ్లు, నాగలితో వ్యవసాయం చేసేవారు. వాటితోపాటు అనుబంధంగా పాడి ఆవులు, జీవాలు, కోళ్ల పెంపకం చేపడుతూ అదనపు ఆదాయం పొందేవారు. పశువుల పేడ, కోళ్ల ఎరువులతో సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆరోగ్యంతోపాటు రైతులకు ఆదాయం ఉండేది. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఎడ్లనాగలి కనుమరుగై.. యంత్రాల వినియోగం పెరిగింది. వీటి ప్రభావం నేల, మనుషులపై పడి నేలలో జీవం తగ్గి, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

తగ్గుతున్న పశుపోషణ

ఒకప్పుడు ప్రతిరైతు ఇంటి వద్ద ఆవులు, ఎడ్లు కనిపించేవి. ప్రస్తుతం యాంత్రీకరణ పెరగడంతో పాడి పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఆవు పేడతో పండించిన పంట, ఆవు, గేదెల స్వచ్ఛమైన పాలతో ప్రజలు చాలా ఆరోగ్యంగా ఉండేవారు. పాడి పశువుల సంఖ్య తగ్గడంతో పాటు సహజ ఎరువుల లభ్యత కూడా పూర్తిగా తగ్గిపోయింది.

రసాయనాల దుష్ప్రభావం

పశుసంపద తగ్గిన తర్వాత రైతులు పూర్తిగా కృత్రిమ ఎరువుల వాడకంపై ఆధారపడ్డారు. మోతాదుకు మించి యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువుల వాడకం వల్ల తాత్కాలికంగా పంట దిగుబడి వస్తున్నప్పటికీ క్రమక్రమంగా భూమిలో సారం తగ్గిపోతోంది. కీటకనాశినుల వాడకం వల్ల నేల జీవశక్తి పడిపోతోంది. వీటి ప్రభావం పంట పోషకాలపై పడుతోంది. రసాయన ఎరువులు వాడిన పంటలు తినడం ద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మరోవైపు కృత్రిమ ఎరువుల వాడిన పంటతో పోలిస్తే సేంద్రీయ వ్యవసాయంలో పంట దిగుబడి తక్కువ రావడం, సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, పండిన పంటలకు కొనుగోలు హామీ, ధరల స్థిరత్వం లేకపోవడం వంటి కారణాలతో రైతులు సేంద్రీయ వ్యవసాయంపై ఆసక్తి చూపడం లేదు.

చేయాల్సిన పనులు

- గ్రామాల్లో రైతులకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి సేంద్రీయ వ్యవసాయం, జీవ ఎరువుల తయారీపై శిక్షణ ఇవ్వాలి.
- సేంద్రీయ ఉత్పత్తుల సర్టిఫికేషన్ ప్రక్రియ సులభతరం చేయాలి.
- సేంద్రీయ పంటలకు ప్రత్యేక మార్కెట్‌తోపాటు మద్దతు ధర, బీమా, రాయితీలు కల్పించాలి.
- వ్యవసాయశాఖలో సేంద్రీయ వ్యవసాయానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి, స్పష్టమైన పాలసీ తయారు చేయాలి.
- జీవాల పెంపకం లాగానే స్థానిక జాతుల ఆవులు, గేదెల పెంపకం కోసం ప్రత్యేక రాయితీలు ఇచ్చి గోశాలలను అభివృద్ధి చేయాలి.

మార్కెటింగ్ సదుపాయం తప్పనిసరి



వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం ద్వారా భూమి, నీరు కలుషితం అవుతోంది. తద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కేంద్రప్రభుత్వం ఈ ఏడాది నుంచి ప్రతి మండలంలో 125 మంది రైతులకు శిక్షణ ఇచ్చి ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహిస్తోంది. మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించే అవకాశం ఉంది.
– భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి